క్లుప్తంగా

జేపీఎస్ సోని మృతికి నివాళి

ఆదిలాబాద్: జేపీఎస్‌ల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం రంగాపురం జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరి సోని ఆత్మహత్య చేసుకోవడంతో ఆమె మృతికి నిరసనగా జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద జేపీఎస్‌లు శుక్రవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి పాల్గొని మాట్లాడారు. జేపీఎస్‌లను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. బలిదానం చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, జేపీఎస్‌లు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

తాంసి: భీంపూర్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. సరిపడా కోరం లేక శుక్రవారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశారు. ఎంపీపీ రత్నప్రభ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సభ్యులు హాజరు కాలేదని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఎంపీపీ అనుమతితో మళ్లీ సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: భుక్తాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫ రాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. భుక్తాపూర్, సినిమా రోడ్, మోచిగల్లి, ద్వారకానగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ, పిప్పల్‌ధరి, అంకోలి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వడూర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో గల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు చేయనున్నట్లు శాఖ ఏఈ నాగేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వడూర్, తేజాపూర్, బొందిడి, బుద్దికొండ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన ఆడెపు చరణ్ శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వన్నెల అశోక్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు బూర్గుల మల్లేశ్‌లు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్, గోవర్ధన్ ఉన్నారు.

మంత్రికి సన్మానం

ఉట్నూర్‌రూరల్: పదో తరగతి ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రంలో నిర్మల్ జిల్లా ప్రథమ స్థానం నిలవడంతో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాంజాదవ్‌లు మండలంలోని ఎక్స్‌రోడ్డులో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. విద్యాధికారులు, అధ్యాపకుల ద్వారానే ఇది సాధ్యమైందని కొనియాడారు.

భూసార పరీక్షలపై అవగాహన

ఖానాపూర్: మండలంలోని అడవిసారంగాపూర్‌లో భూసార పరీక్షలపై రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డ్రీమ్స్ సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చిన్నయ్య మాట్లాడారు. భూసార పరీక్షలపై రైతులు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా ఎరువుల వాడకంలో అదనపు ఖర్చులు తగ్గించి భూసారం కాపాడుకుంటూ దిగుబడులు పొందవచ్చన్నారు. రైతులు భూసారపరీక్షలు చేయించడం ద్వారా నేలలోని పోషకాలకు అనుగుణంగా పంటలకు ఎరువులను అందించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సంధ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

16న వీరన్న వర్ధంతి సభ

ఖానాపూర్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 16న నిర్వహించే మారోజు వీరన్న 24వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని బహుజన కమ్యూనిస్ట్ పార్టీ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి పసుపుల వెంకన్న కోరారు. శుక్రవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పూలే, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా వీరన్న కమ్యూనిస్టులను ఏకం చేసి ఎన్నో ఉద్యమాలు చేసి.. అమరత్వం పొందాడన్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

- నిధులు మంజూరైనా.. ప్రారంభం కాని పనులు
- వర్షాకాలంలో గిరిజనులకు తప్పని తిప్పలు



కుంటగూడకు వెళ్లే రోడ్డు దుస్థితి

సిరికొండ: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా.. ఇప్పటికీ కొనిన పల్లెలు బాహ్య ప్రపంచాన్ని చూడలేకపోతున్నాయి. కారణం గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం. గిరిజన గూడేలకు, లంబడీతండాలకు సరైన రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. మట్టిరోడ్డుపైనే ప్రయాణం చేసి కాలం వెల్లదీస్తున్నారు.

కలగానే బీటీరోడ్లు..

సిరికొండను 2016 సంవత్సరంలో నూతన మండలంగా ఏర్పాటు చేశారు. 19 గ్రామ పంచాయతీలు, 52 గ్రామాలను ఏర్పాటు చేశారు. మండలం ఏర్పాటుతోనైన సమస్యలు పరిష్కరం అవుతాయని సంబురపడిన ప్రజలు ఆశలు అడిఆశలు అయ్యాయి. తామ గ్రామాలకు బీటీరోడ్లు రవాణా సౌకర్యాలు వస్తాయని కలగాన్న గిరిజనుల కల కలగానే మిగిలింది.

ఐదేళ్ల క్రితం శంకుస్థాపన..

మండలంలోని వాయిపేట్, రిమ్మ, లక్ష్మీపూర్, ధర్మసాగర్ గ్రామాల రోడ్లకు గత 2018లో ప్రధాన మంత్రిసడక్ యోజక పథకం కింద రూ. 15.85 కోట్లు నిధులు మంజూరయ్యాయి. మండల కేంద్రం నుంచి వాయిపేట్ వరకు 15 కిలోమీటర్లు రోడ్డు రూ. 7 కోట్లు, రిమ్మ నుంచి వాయిపేట్ రోడ్డు వరకు 3.5 కిలోమీటర్లు రోడ్డుకు రూ. కోటిన్నర కోట్లు, లక్ష్మీపూర్ నుంచి వాయిపేట్ వరకు 8 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 7కోట్లు, ధర్మసాగర్ నుంచి వాయిపేట్ రోడ్డు వరకు రూ. 35 లక్షలు నిధులు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎంపీ గోడం నగేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ శంకుస్థాపన చేశారు. దీంతో ఆర్అండ్‌బీ వారు టెండర్లు కూడా పూర్తి చేశారు.

అనుమతుల కోసం ఎదురుచుపులు..

బీటీరోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు అడ్డంకిగా మారాయి. వాయిపేట్ పరిసర ప్రాంతం కవ్వాల్ అభయారణ్య ప్రాంతం (టైగర్ జోన్) కిందకి వస్తుంది. ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మించేందుకు అటవీశాఖ అనుమతులు ఇవ్వడం లేదు. దీంతో నిధులు మంజూరై ఐదేళ్లు అవుతున్నా.. పనులు మొదలు కాలేదు. దీంతో సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఈ వర్షకాలం కూడా గిరిజన ప్రజలకు రవాణా కష్టాలు తప్పేలా లేవు. మండల, జిల్లా కేంద్రానికి చేరాలంటే తమ ప్రాణాలను పాణంగా పెట్టి ప్రయాణం చేయాల్సిందే. కొన్ని గిరిజన గ్రామాలకు 108కూడా వెళ్లాలేని పరిస్థితి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని బీటీరోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



శంకుస్థాపన చేస్తున్న అప్పటి ఎంపీ, ఎమ్మెల్యే

పనులు ప్రారంభించలేదు



తమ గ్రామానికి రోడ్డు మంజూరైందని సంతోషపడ్డాం. కానీ ఐదేళ్ల క్రితం మంజూరైన రోడ్డు పనులు ఇప్పటికీ మొదలు కావట్లేదు. మా గ్రామం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. వర్షకాలం వైద్యం కోసం ఎడ్లబండితో ప్రజలు ప్రయాణిస్తున్నారు.

– పెందుర్ అనిల్, రిమ్మ సర్పంచ్

ఎడ్లబండి కూడా పోదు

కుంటగూడ గ్రామానికి కనీసం ఎడ్లబండి కూడా పోలేదు. రోడ్డు మరీ అధ్వానంగా మారింది. గ్రామం నుంచి వాయిపేట్ వరకు ఉన్న రోడ్డు గత వర్షానికి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటున్నాం.

– గంగారాం, కుంటగూడ, సర్పంచ్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయంలో ప్రతిష్ఠించిన బ్రహ్మంగారు, సిద్దప్ప, గోవిందమ్మ విగ్రహాలు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం బ్రహ్మంగారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమంతో పాటు, ప్రత్యేక పూజలు నిర్వహించి, జలాధివాసం, ధాన్యాదివాసం, పుష్పాదివాసం పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య బ్రహ్మంగారు, సిద్దప్ప, గోవిందమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమ లస్మన్న, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గంగయ్య, ఉల్లాస్, కుర్సంగే లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ దేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) గ్రామంలోని శ్రీమహాలక్ష్మీ దేవి అమ్మవారిని బోథ్ ఎమ్మెలే రాథోడ్ బాపురావు, మాజీ ఎంపీ గోడం నగేశ్, మాజీ డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డితో పాటు తలమడుగు మండలం సుంకిడి గ్రామానికి చెందిన భక్తులు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామస్తులు ప్రతి ఐదేళ్లకోసారి ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా (టి) సమీపంలోని మహాలక్ష్మీదేవిని దర్శించుకోవడం అనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం



ప్రైవేట్ వాహనదారులు ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. గూడ్స్ వాహనాల్లో సైతం ఎక్కించుకొని వెళ్తున్నారు. ప్రస్తుతం పెళ్లిల సీజన్ కావడంతో నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తరలిస్తూ.. ప్రమాదాలకు కారణమవుతున్నారు. తనిఖీలు చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని ఉట్నూర్ మండలంలో గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తున్న ప్రైవేట్ వాహనాల చిత్రాలను సాక్షి, క్లిక్‌మనిపించింది.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్





నిరుపేదల కోసమే ప్రభుత్వ రెసిడెన్షియల్స్



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రశాంత్‌రెడ్డి

సిరికొండ: నిరుపేదల కోసమే ప్రభుత్వ రెసిడెన్షియల్స్ ఉన్నాయని రెసిడెన్సియల్ పాఠశాల ప్రత్యేకాధికారి ప్రశాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొలాం గూడ, సిరికొండ గ్రామాలను సందర్శించి డ్రాప్ అవుట్, అనాథ, నిరుపేదల బాలుర కోసం ఏర్పాటైన అర్బన్ రెసిడెన్సియల్ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. హాస్టల్ వసతితో పాటు తెలుగు, ఆంగ్లం మాధ్యమంలో బోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఆర్టీ రాజేశ్వర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- పీహెచ్‌సీలో సాధారణ కాన్పులే
- అందుబాటులో లేని గైనకాలజిస్టులు
- అత్యవసరమైతే ప్రైవేట్ ఆస్పత్రే దిక్కు

ఆపరేషనా.. ప్రైవేటుకే



నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నేరడిగొండ: సర్కారు ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని ప్రభుత్వం వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కేసీఆర్ కిట్లు, ఇతర నగదు ప్రోత్సాహకాలు అందిస్తోంది. గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారనే తప్పా వసతులపై దృష్టిసారించడం లేదు. సిబ్బంది కొరత, వసతుల కల్పనలో ముందడుగు వేయకపోవడంతో వైద్యం అందడం లేదు. మండలంలో గతేడాది ఏప్రిల్ నుంచి ఏడాది మార్చి వరకు 542 మంది ప్రసవం కాగా, 159 మంది ప్రైవేటు ఆస్పత్రుల్లో, 383 మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీ అయ్యారు. నేరడిగొండ పీహెచ్‌సీలో వంద వరకు ప్రసవమయ్యారు. అయితే ఆదిలాబాద్ రిమ్స్‌కు 57 మంది, నిర్మల్‌కు 190, బోథ్ ఆస్పత్రికి 10 మంది, జిల్లాలోని ఆయా సీహెచ్‌సీలో 26 మంది గర్భిణులను రిఫర్ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో 42 మంది గర్భిణులు ప్రసవం కాగా, పీహెచ్‌సీలో ఏడుగురు, ఆదిలాబాద్, నిర్మల్, తదితర ప్రభుత్వ ఆస్పత్రుల్లో 29 మంది, 13 మంది ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగాయి.

సాధారణ కాన్పులకే పరిమితం..

మండలంలోని పీహెచ్‌సీలో గైనకాలజిస్ట్ లేకపోవడంతో సాధారణ కాన్పుకే పరిమితమయ్యారు. అది క్లిష్టపరిస్థితి అయితే ప్రైవేట్‌కు రెఫర్ చేస్తున్నారు. అత్యవసరమైతే ఆపరేషన్ చేయాల్సి ఉండగా, సిబ్బంది కొరత కారణంగా ఇతర ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఎక్కువగా పేదలు ఉండడంతో ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేస్తే వేలకు వేలు చెల్లించుకోలేక ప్రాణాల మీదికి తెచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పెరిగిన సాధారణ కాన్పులు

మండల పరిధిలో 24 గంటలు సేవలు అందుబాటులో ఉండే నేరడిగొండ పీహెచ్‌సీలో ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో గతేడాది కంటే ఈసారి సాధారణ కాన్పుల సంఖ్య రెట్టింపు అయింది. గైనకాలజిస్ట్ లేకపోవడంతో కేవలం స్టాఫ్‌నర్సులు, సిబ్బంది అందుబాటులో ఉండి సాధారణ కాన్పులే చేస్తున్నారు. గతేడాది పీహెచ్‌సీలో వంద వరకు సాధారణ కాన్పులు చేశారు.


అత్యవసరమైతే జిల్లా ఆస్పత్రికి..



కాన్పు కోసం వచ్చే వారికి సాధారణ కాన్పు కోసం ప్రయత్నిస్తున్నాం. తప్పనిసరి పరిస్థితిలో అత్యవసరమైతే జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తాం. అక్కడ సౌకర్యాలు ఉంటాయని చెప్పినా కొందరు ప్రైవేట్ ఆస్పత్రులకే వెళ్తున్నారు. ఆపరేషన్ థియేటర్ ఇక్కడ ఉన్నా గైనకాలజిస్ట్ వైద్యులు లేక ఆపరేషన్లు చేయలేకపోతున్నాం.

– రాంనరేశ్, మండల ఆరోగ్య పర్యవేక్షకుడు, పీహెచ్‌సీ, నేరడిగొండ

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

నేరడిగొండ: మండల కేంద్రంలో ఈనెల 15 నుంచి సీఎం కప్ పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల క్రీడా మైదానాన్ని తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎంఈవో భూమారెడ్డి, పీఈటీ యశంత్ నాయక్‌లతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం కప్ క్రీడలను ఈనెల15 నుంచి 17 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

‘దేశ సంపదను బీజేపీ ధారాదత్తం చేస్తోంది’



అవగాహన కల్పిస్తున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు బీజేపీ ప్రభుత్వం ధారాదత్తం చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో రైతుబజార్‌లో రైతులకు బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై కరపత్రాలను పంచుతూ.. అవగాహన కల్పించారు. బీజేపీ మతం పేరుతో రాజకీయం చేస్తోందన్నారు. సినిమాల్లో కూడా మతాన్ని చూపించడానికి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో మెజారిటీగా ఉన్నటువంటి వారిని కొనుగోలు చేసి అధికారంలో రావడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, మెస్రం భాస్కర్, అరుణ్ కుమార్, గేడం కేశవ్, అర్దాంగి రమేశ్, పెందూర్ తుకారం, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె



నిరసన తెలుపుతున్న వీవోఏలు

ఇంద్రవెల్లి: సమస్యలు పరిష్కరించాలని వీవోఏలు చేపట్టిన సమ్మె 26వ రోజుకు చేరుకుంది. శుక్రవారం తమ డిమాండ్ పత్రాలను చూపుతూ.. నిరసన తెలిపారు. మండల అధ్యక్షులు షేక్ ఫెరోజ్ మాట్లాడుతూ.. వీవోఏలకు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ. 26 వేలు వేతనం అందించాలన్నారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం మండల ఉపాధ్యక్షుడు కోట్నాక్ బారిక్‌రావ్, జుగ్నాక్ రాందాస్, జైపాల్, చంద్రకాంత్, ఉమా, జానకి, జలదేవి, మహేశ్వరి, నందిని, సునీత పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో ఐకేపీ వీవోఏల సమ్మెకు కాంగ్రెస్ నాయకులు పెందూర్ ప్రభాకర్ మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ్మెకు కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఆరోగ్య బీమా, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తింపు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాపురావు, సర్పంచ్ జాదవ్ సునీల్, సిరాజ్ ఖాన్, రాహుల్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై సునీత

ఆదిలాబాద్‌టౌన్: ఆడ పిల్లలు, మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై సునీత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓసియన్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే 100కు డయల్ చేయాలన్నారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్, బాడ్‌టచ్, క్యూఆర్ కోడ్, పోక్సో చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై సీహెచ్ మహేశ్‌సింగ్, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులకు సన్మానం



సన్మానిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

ఎదులాపురం: అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులను మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, పలువురు కౌన్సిలర్లు శుక్రవారం పట్టణంలోని కైలాసనగర్‌లోని బుద్ధ విహార్‌లో సన్మానించారు. ఇటీవల పట్టణంలో అంబేద్కర్ జయంతి, విగ్రహావిష్కరణ, బుద్ధ జయంతిని విజయవంతంగా చేసినందుకు ఉత్సవ కమిటీ చైర్మన్ దుర్గం శేఖర్, సభ్యులు కోకస్వీనర్లు బాబాసాహెబ్ కాంబ్లే, శాలిక్‌రావు, శైలేందర్ వాఘ్మారే, శోభబాయి, దయానంద్ కాంబ్లే, మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు సత్కారించారు.

అడిషనల్ ఎస్పీకి..

ఆదిలాబాద్: పోలీస్‌శాఖలో అత్యుత్తమ సేవలకు గాను అతి ఉత్కృష్ట సేవా పతకం సాధించిన జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మినిస్ట్రేషన్) ఎస్. శ్రీనివాసరావును సనాతన హిందూఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆయనకు శాలువా, జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రమోద్ కుమార్ ఖత్రి గేడం మహదేవ్, రెనికుంట్ల రవీందర్, బరాడి లచ్చు, బారడి రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు సన్మానం

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన అరుగుల శ్రీనివాస్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం గణితంలో డాక్టరేట్ ప్రదానం చేయడంతో శుక్రవారం మాజీ విజయ డైరీ చైర్మన్ లోక భూమారెడ్డి, సర్పంచ్ పుండ్రు పోతరెడ్డి ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.